టిడ్కో గృహాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు: మంత్రి సురేష్

విశాలాంధ్ర - యలమంచిలి: టీడీపీ హయాంలో అరకొర సౌకర్యాలతో తుతూమంత్రంగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు.. పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. యలమంచిలి పట్టణంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అయితే డ్రైనేజీ నీరు శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిననంతరం టిడ్కో గృహ సముదాయాలను ప్రారంభించి లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. వర్షం అధికంగా సుమారు రెండు గంటల సేపు ఏకధాటిగా కురవడంతో టిడ్కో ప్రాంగణంలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభ రద్దవ్వడంతో స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను, నమూనా తాళాలను కొంతమంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే యూ.వి.రమణమూర్తి రాజు (కన్న బాబు)తో, టిడ్కో చైర్మన్ జె.ప్రసన్నకుమార్‌లతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేసేలా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్లను పరిపూర్ణంగా ముస్తాబు చేసి అన్ని వసతులతో పేద ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి, ఆర్డీవో చిన్నికృష్ణ, టిడ్కో డైరెక్టర్లు, సిఈ, ఎస్ఈ, ఈఈ, మెప్మా పిడి ఎన్.సరోజిని పాల్గొన్నారు.

2వ విడత 79 విలేకర్లకు అక్రిడేషన్లు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అక్రిడే షన్ల ప్రక్రియలో 2వ విడతగా జిల్లాలోని 79 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో చర్చించి మంజూరు చేశారు. మొదటి విడత మంజూరు చేసిన 160 అక్రిడేషన్లతో కలిపి మొత్తం 239 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు కె.చంద్రరావు, వి.లోవరాజు, టి.రమేష్, కె.చంద్రశేఖర్, ఎస్.కే.చాంద్ భాషా, గృహ నిర్మాణ శాఖ పిడి కే.రమామణి, జిల్లా రవాణా అధికారి సుజాత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చిన్న మునిస్వామి, డిఐపిఆర్ఓ కె. ఇంద్రావతి, డిపిఆర్ఓ డి.సాయి బాబా ఆరోగ్యశ్రీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ మెనూ అదుర్స్

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: దుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహంలో కొలువు ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు అందుతున్న రోజువారి మెనూ అమలు నాణ్యతగా ఉందని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి అన్నారు. సోమవారం దుంబ్రిగుడ కేంద్రాన్ని సందర్శించిన ఆమె ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని సందర్శించి భోజన మెనూ అమలును పరిశీలించారు. వసతి గృహ నిర్వాహకులు హెచ్‌డబ్ల్యుఓ రవికుమార్ నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాలను అందించడాన్ని అభినందించారు.

డా. ఎంవివిఎస్ మూర్తి జయంతి

విశాలాంధ్ర - మధురవాడ: గీతం విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త, పార్లమెంట్ మాజీ సభ్యుడు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి 85వ జయంతిని సోమవారం గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆవరణలోని డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి విగ్రహం స్మృతివనం వద్ద గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగా ధరరావు, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, కేంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ బి.గీతాంజలి, లా కళాశాల డీన్ అనితారావు, గీతం మేనేజ్‌మెంట్ డీన్ అమిత్‌భద్ర, ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామరాజు, వివిధ కళాశాలల డైరక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అరాజెన్ ఫార్మా ఎదుట నిర్వాసితుల ఆందోళన

విశాలాంధ్ర - పరవాడ: రాంకీ ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లోని ఆరాజెన్ పరిశ్రమ గేటు ఎదుట నిర్వాసితులు సోమవారం ఆందోళన చేపట్టారు. నిర్వాసితులను తక్షణమే పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ నిర్వాసితులకు మద్దతు పలికారు. నిర్వాసితులను పరిశ్రమలో పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు, హక్కులను అమలు చేయడంతో పాటు రెండు సంవత్సరాలు పూర్తి చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులనూ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసినప్పటికీ పరిశ్రమలో అవేమీ అమలు కాకపోవడం దుర్మార్గం అన్నారు. కార్మికులను యాజమాన్యం చులకనగా చూస్తే సహించమని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వైసిపి నేత ఇల్లపు ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లపు వాసు, బొద్దపు చిన్నారావు, బుగిడి రామ గోవిందరావు, కింతాడ ఈశ్వరరావు, నిర్వాసితకార్మికులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - విశాఖ : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు, అధ్యక్షులు కె.అచ్యుత్ పిలుపునిచ్చారు. విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ ఆర్.బి.కె. కేంద్రాల్లో ఖాళీగా ఉన్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులు, గ్రూప్ 1, 2, పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుని ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ఎస్సై, కానిస్టేబుల్ రిలీఫ్ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.మధురెడ్డి, భరత్, యు.నాగరాజు పాల్గొన్నారు.

గురపౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు పాత గోపాల పట్నంలో సాయిబాబా గుడిలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, వైసీపీ నాయకురాలు పేడాడ రమణి కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గుని శెట్టి శ్రీనివాసరావు, పొట్నూరు శంకర్రావు, కంపర సత్తిబాబు, వి.ఎన్. రాజు, పసుపురెడ్డి రమణ, బల్లంకి వెంకటరావు, కరణం కనకరాజు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాడల్లో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం షిరిడి సాయినాథ్ ఆలయాల్లో తెల్లవారుజాము నుండే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. దీంతోపాటు అన్న సమారాధన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా సింధియా, న్యూ కాలనీ, శ్రీహరిపురం, గొల్లలపాలెం సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొమ్మాది: గురుపౌర్ణమి వేడుకలను జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధి స్వతంత్రనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీ సాయి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు అధికార్ల కాళిదాసు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పిళ్లా వెంకట్రావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి పూజ అనంతరం తీర్థ ప్రసాదములు స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, 5, 7వ వార్డుల వైసీపీ అధ్యక్షులు పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, నాగోతి సత్యనారాయణ (జపాన్), అల్లాడ లింగేశ్వరరావు, భాగధి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, జగదభి రామ కనస్ట్రక్షన్స్ అధినేత నక్కా శ్రీధర్, కనకదుర్గ ఈవెంట్స్ సప్లయర్స్ కోర్రయి సురేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఉగ్గిన నాగరాజు, కార్యదర్శి లోలుగు రమేష్ నాయుడు, గౌరవ అధ్యక్షులు పొలిమాటి సునీల్ కుమార్, కోశాధికారి జీలకర్ర గణేష్, ఉపాధ్యక్షులు కరకాని ఈశ్వరరావు, ఉప కార్యదర్శి మోడి శివ, ఉపకోశాధికారి దత్తి హరి, కమిటీ సభ్యులు కెల్లా చిన్న, ప్రశాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: గురు పౌర్ణమి సందర్భంగా కొత్త కొవ్వాడలో 2500 మందికి అన్న సంతర్పణ చేపట్టారు. స్వర్గీయ దంతులూరి అప్పలరాజు భార్య రుక్మిణి దేవి జ్ఞాపకార్థం కుమారులు నిర్మించిన శ్రీ సద్గురు సాయినాథ గుడి వద్ద 2500 మందికి అన్నదానం చేశారు. పలువురు సాయినాధుని ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం జెడ్పీటీసీ ఎస్.గిరిబాబు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో స్థాయి సంఘం ఎన్నికలకు జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుత స్థాయి సంఘం కాల పరిమితి ఈనెల 26తో ముగుస్తున్నందున, నూతన స్థాయి సంఘం సభ్యులు ఎన్నుకొనుటకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల11 తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జీవీఎంసీలో అదనపు కమిషనర్ ఫైనాన్స్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునని తెలియజేశారు. 12 తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికలు జరుగుతాయని తెలియజేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకై ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడడానికి ప్రజలందరూ సహకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ బ్యాగ్ డేని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. "సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ - బ్రింగ్ యువర్ ఓన్ బ్యాగ్- గ్రీన్ బ్యాగ్స్' అనే నినాదంతో తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యవిభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్లాస్టిక్ పై నిషేదం విధించడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని నిషేదించారని, దీనికి ప్రజలంతా పాటించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్తించాలని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలిన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ డాక్టర్ బి.ప్రవీణ, డాక్టర్ వి.వి.వి ప్రకాష్, డాక్టర్ కె.రాము, డాక్టర్ రాజు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నామవరంలో దాహం కేకలు

- నెలరోజులుగా కుళాయిల నుంచి చుక్కనీరు లేదు
- గాంధీనగర్‌లో నాలుగేళ్లుగా కుళాయిలే లేవు

పనిచేయని బోరు

నామవారం గ్రామంలోని ట్యాంకు

తరుచూ పైపులైన్‌కి మరమ్మతులు

చుక్కనీరు రాని కుళాయిలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటకు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన ఉన్న నామవరం గ్రామంలో గత నెలరోజులుగా ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. గత నెలరోజులుగా కుళాయిల నుండి చుక్క నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక గ్రామంలోని గాంధీనగర్‌లో గత నాలుగేళ్లుగా కుళాయిలు లేకుండా పోయాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 3 వేలపైగా జనాభా ఉన్న నామవరం గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు రక్షిత మంచినీటి సరఫరాకు బోర్ల నుండి మంచినీరు రాకపోవడంతో పాయకరావుపేట జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద బోరు తవ్వి ఇక్కడ నుండి 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న నామవరం గ్రామానికి పైపులైన్లు వేసి, అక్కడ ట్యాంకు నింపి గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా అందిస్తున్నారు. అయితే పైపులైను వేసి సుమారు 40 ఏళ్లు కావడంతో తరుచూ మరమ్మతులకు గురవుతోంది. నామవరానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైను నుండి పట్టణంలోని చక్కా నగర్ వాసులకు తాగునీటి అందించడంతో నామవరం గ్రామానికి నీటి సరఫరా సక్రమంగా జరిగేది కాదు. దీంతో నామవరం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చక్కానగర్‌కు తాగునీటి సరఫరా నిలిపివేశారు. అయితే తరుచూ మరమ్మత్తులకు గురయ్యే పైపులైను ఈసారి పూర్తిగా పాడయింది. పైపులైను పక్కన ఉన్న చెట్లు వేళ్లు పైపుల్లోకి వెళ్ళి పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో గత నెలరోజులకుపైగా నామవరం గ్రామానికి తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. అంతేగాక గ్రామంలో ఉన్న బోర్లు కూడా అరకొరగా పనిచేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామవరం గ్రామంలోని గాంధీనగర్‌కు రక్షిత మంచినీటి సరఫరా పథకం నుండి సుమారు 10 కుళాయిలకు తాగునీటి సరఫరా జరిగేది. అయితే గత నాలుగేళ్లుగా ఇక్కడి కుళాయిల నుండి చుక్కనీరు రావడం లేదు. సమీపంలోని బావుల నుండి వాడుకునే నీరు తెచ్చుకొని, తాగడానికి మినరల్ వాటర్ కొనుక్కుంటున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

రూ.25లక్షలతో ప్రతిపాదనలు

నామవరం గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు పైపులైను మార్చేందుకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. మండల పరిషత్ నుండి రూ.5లక్షలు మంజూరు చేసేందుకు ఎంపీపీ అంగీకరించారు. డక్కన్ పరిశ్రమ సీఎస్ఆర్ పథకం ద్వారా రూ.20లక్షలు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు కోరారు. పైపులైను మార్చే వరకు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేసాం.

- ఎంపీడీఓ సాంబశివరావు

ఎరుకల వీధిలో పక్కా ఇళ్లకు ఎమ్మెల్యే హామీ

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ 15వ వార్డులో సోమవారం ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేషమైన స్పందన లభించింది. 15వ వార్డు ఎరుకల వీధిలో ఇప్పటికీ పూరి గుడిసెలో నివాసం ఉంటున్న 13 కుటుంబాలకు వారికి వారు నివసిస్తున్న ప్రాంతంలోనే పక్కా ఇళ్లు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే గణేష్ హామీ ఇచ్చారు. అలాగే మీ నివాస ప్రాంతానికి వచ్చే మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, 15వ వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లి దొర, అయ్యరక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోకవరపు శారద, 23వ వార్డు ఇంచార్జ్ అన్నపూర్ణ, 27వ వార్డు ఇంచార్జ్ కొణతల వరలక్ష్మి, టౌన్ వైసీపీ అధ్యక్షుడు ఏక శివ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, టౌన్ ఎస్ఐ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష: ముత్తంశెట్టి

విశాలాంధ్ర - ఆనందపురం: సంక్షేమ పథకాలతో పాటు ప్రజల యొక్క సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆనందపురం మండలంలో గంభీరం, వెల్లంకి గ్రామ పంచాయతీలో జగనన్న సురక్షలో భాగంగా స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ సత్యప్రభ, డీఎల్‌డీఓ పూర్ణిమా, ఎమ్మెల్యే ముత్తంశెట్టిలు ముఖ్య అతిథిగా విచ్చేసారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల యొక్క సమస్యలు ఉంటే నేరుగా సచివాలయానికి వెళ్లి పరిష్కరించుకోవచ్చని అన్నారు. జగనన్న సురక్షలో భాగంగా గ్రామ సచివాలయంలో 11 రకాల సర్టిఫికెట్స్ అందజేస్తారని అన్నారు. అలాగే గంభీరం గ్రామపంచాయతీలో 1400 కుటుంబాలకి సుమారు 12 కోట్లు రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. వెల్లంకి గ్రామ పంచాయతీలో సుమారుగా 6 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నారు. నాడు-నేడు ద్వారా ఒక కోటి రూపాయలు, అలాగే 1500 కుటుంబాలకు గాను సంక్షేమ పథకాలు ద్వారా 18 కోట్ల 30 లక్షల రూపాయలు ఈ నాలుగున్నర సంవత్సరాలు కాలంలో ఇచ్చామని తెలిపారు. వెల్లంకి గ్రామపంచాయతీలో రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు గురించి వెల్లంకి టీడీపీ ఎంపీటీసీ పడాల అప్పలనాయుడు వినతి అందించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, వైసీపీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్, మండల సచివాలయ కన్వీనర్ గంద్రెడ్డి శ్రీను, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్య నారాయణ, మాజీ ఏఎంసీ విన్నింటి వెంకటరమణ, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, శ్రీను, మహంతి శివాజీ, కోర్రాయి సూరిబాబు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్ళు ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు

విశాలాంధ్ర - భీమిలి: ప్రజలను మభ్యపెట్టే దొంగ ప్రకటనలతో వైసీపీ కాలం వెళ్లబుచ్చుతుందని, ఇలాంటి చౌకబారు ప్రకటనలకు స్వస్తి పలకాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విజయాడంకా మోగిస్తుందని, 175/175 అసెంబ్లీ స్థానాలు అని 25 ఎంపీ స్థానాలకు 25 కైవసం చేసుకుంటామని దొంగ ప్రకటనలు, దొంగ సర్వేలు చేయడం జగన్ రెడ్డి సర్కార్ మానుకోవాలని అన్నారు. సోమవారం భీమిలి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గంటా నూకరాజు మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో ఏ అభివృద్ధి చేశారని రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయడంకా మోగిస్తుందని గంటా నూకరాజు ప్రశ్నించారు. సామాన్య ప్రజలను నట్టేట ముంచి నందుకా..? డ్రగ్స్, గంజాయి లాంటి ప్రమాదకర ఔషధాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రాను మార్చినందుకా..? మహిళలపై దాడులు, హత్యలు పెరిగినందుకా..? భూ కబ్జాలు, రౌడీయిజాన్ని పెంచి పోషిస్తున్నందుకా..? రాజధాని లేని రాష్ట్రంగా మార్చినందుకా..? రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజలనెత్తిన అప్పుల కుంపటి పెట్టినందుకా...? అని ప్రశ్నించారు. దొంగ సర్వేలతో తప్పుడు నివేదికలను సొంత పేపర్లో రాయించుకొని ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు.

అట్టహాసంగా జగనన్న సురక్ష

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సోమవారం డిఎల్‌పురం, ఉద్దండపురం గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట నియోజక వర్గ శాసన సభ్యులు గొల్ల బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టిన విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరెక్టర్, రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, డిఎల్‌పురం సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపిడివో సీతారామరాజు, తహశీల్దార్ అంబేద్కర్, ఈఓపీఆర్డీ నారాయణరావు, వైసీపీ నాయకులు లొడగల చంద్ర రావు, పొడగట్ల పాపారావు, అయినంపూడి మణి రాజు, శీరం నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కేంద్ర డిప్యూటీ సెక్రటరీ ఆరా

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలంలో గిరిజనేతర పంచాయతీలైన గరుగుబిల్లి పరిధిలో పీవీటీజీ గ్రామం పందిరివలసలో కేంద్ర గిరిజనుల వ్యవహారాల శాఖ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ రాజి పర్యటించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. గరుగుబిల్లి సర్పంచ్ బుంగ మధులత అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజి మాట్లాడుతూ 100శాతం గిరిజనులు ఉన్న గిరిజన ప్రాంతం ఏ విధంగా గిరిజేనేతర ప్రాంతం అయిందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ వలసల నివారణకు ఉపాధి పని దినాలు పెంచాలని కోరారు. అనంతరం మండలంలోని గరుగుబిల్లి పంచాయితీ పందిరివలస, ఊట గడ్డ, టీంపోల్ పంచాయితీ లువా, బి.కొత్తవలస పివిటిజి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఏవివి కుమార్, తహశీల్దార్ రామ్ భాయ్, ఏటీడబ్ల్యూ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గణేష్, సాయి, విజయ్, ఏపీవో అర్జున్, ఏపిఎం సూర్యారావు, ఎంపీటీసీ తవిటినాయుడు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, ఎంపీటీసీ అశోక్, సర్పంచ్ మధులత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

విశాలాంధ్ర - తగరపువలస: అర్హత ఉన్న వారందరికీ పథకాలు అందడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధిలో గల మజ్జివలస పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా అవంతి చేతుల మీదుగా అర్హత ఉన్న లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికేట్‌లు అందిం చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓను కలిసిన ఎంపీపీ

విశాలాంధ్ర - అనంతగిరి: నూతన మండల విద్యా శాఖాధికారిగా నియమితులైన కె.బాలాజీని ఎంపీపీ శెట్టి నీలవేణి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యా వ్యవస్థ పనితీరు మరింత మెరుగుపడేందుకు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పుడిగి దేముడు, సన్యాసిరావు, శెట్టి రాంబాబు, నరాజి మల్లేశ్వరరావు కె.రఘు, కె.ప్రసాద్, మంజునాథ్, అచ్చిబాబు, బిఎస్ఎన్ పడాల్, అరకులోయకు చెందిన పోలు మాస్టర్, ప్రదీప్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు క్యాంటిన్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు సోమవారం డైరెక్టర్ (పర్సనల్) సురేష్చంద్రపాండేకు వినతిపత్రం అందజేశారు. ప్లాంట్ క్యాంటీన్ల పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందని, పరిశుభ్రత లోపించిందని, ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం అందించే విధంగా కృషి చేయాలని విన్నవించారు. కార్య క్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, డి.సాహూ, బీఎంకె.నాయక్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, జీవీ.సుబ్బయ్య, వీవీ.నగేష్, సీహెచ్. సుదర్శన్, పి.పోతారెడ్డి, గొవిశెట్టి వెంకటరావు, గంగవరం గోపి, మింది దేముడు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ భక్తులకు పాదాభివందనం: ఈఓ



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం సింహాద్రిపై కొలువుతీరి ఉన్న వరహ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయం ఆధ్వర్యంలో భక్తులు చేపట్టిన గిరిప్రదక్షిణ మహెూత్సవంలో పాల్గొన్న ప్రతి భక్తునికి పాదాభివందనం అని ఇన్‌చార్జ్ ఈఓ త్రినాథ రావు, ఇఇ శ్రీనివాసరాజు అన్నారు. ఈ సందర్భంగా ఈఓ విలేకరులతో మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ప్రారంభమైన గిరి ప్రదక్షిణ తెల్లవారుజాము వరకు సాగిందన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా భక్తులకు మంచినీరు, ఫలహారాలు అందజేసాయన్నారు. ఆషాడ పౌర్ణిమి సందర్భంగా సింహాద్రినాధుని 4వ విడత చందన సమర్పణ జరిగింది. దేశ, విదేశాల నుండి సింహగిరిపై కొలువై ఉన్న వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - కె.కోటపాడు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత మూడు నెలల నుండి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చకుండా కాలయాపన చేయడంపై సీపీఐ నాయకుల బృందం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ మోటార్ల ద్వారా కూరగాయలు అపరాలు పండించుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. గతంలో వచ్చిన తుఫానుకు మర్రివలస, గుండుపాలెం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని ఇంతవరకు వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడలేదని అన్నారు. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు తెలియపర్చామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, గొర్రెల దేవుడి బాబు, దమ్ము ముత్యాల నాయుడు, అప్పల ఈశ్వరరావు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

అన్నదాతలకు ప్రతీ ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర - చోడవరం: అన్నదాతలకు ప్రతీ ఎకరానికి పది వేల రూపాయలు పంట సహాయం క్రింద అందజేయాలని మండలంలోని అంకుపాలెం పంచాయతీ సచివాలయం వద్ద సోమవారం జరిపిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. యాభై ఏళ్లు నిండిన రైతాంగానికి రూ.5000లు పెన్షన్ ఇవ్వాలని, పంట రుణమాఫీ రెండు లక్షల 50 రూపాయలు వరకు చేయాలని సోమనాథ్ కమిషన్ సిఫార్సు మేరకు సిటీ ప్లస్ 50 మద్దతు ప్రకటించాలని, వ్యవసాయ భూములకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏ.పి రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, ప్రభుత్వానికి తెలియచేసే పద్ధతిలో ఆయా సచివాలయ కార్యదర్శుల ద్వారా వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గులజానా అప్పలనాయుడు, కల్లేపల్లి కోటేశ్వరరావు, కాటుపురం సత్తిబాబు, విస్సరపు నాగూర్, మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి నిరంతర కృషి

విశాలాంధ్ర - హుకుంపేట: మండల విద్యాభివృద్ధికి పూర్తిస్థాయిలో నిర్విరామ కృషి జరుపుతానని మండల విద్యా శాఖ అధికారిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సోమేలి చెల్లయ్య అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వెనకబడిన మండలానికి శతశాతం అక్షరాస్యత సాధించేందుకు ఎనలేని కృషి జరుపుతామని ఆయన స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ప్రతినిత్యం పాఠశాలలను తనిఖీ చేస్తూ అక్కడ సమస్యలను గుర్తిస్తూ నివేదిక రూపొందిస్తూ ఆ సమస్యలపై ప్రభుత్వ ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. విధి నిర్వహణలో వెనక్కి తగ్గేది లేదని నిర్మో హమాటంగా ఉంటూ ప్రతి ఉపాధ్యాయులను చైతన్య పరుస్తూ గిరి విద్యార్థిని, విద్యార్థుల విద్య పట్ల ఆసక్తి పెంచేలా వారిని చైతన్య పరుస్తామన్నారు. ఎంఈఓగా నూతన బాధ్యతలు స్వీకరించిన చెల్లయ్యకు మండలంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 కోద ఈశ్వరరావు, ఉపాధ్యాయ సంఘల నాయకులు ఎల్.వెంకటరమణ, దొర, టి.మత్స్య రాజు, బట్టి చిన్నారావు, పి.సింహాద్రి, బి.కంతంనాయుడు, ప్రభాకర్ పెద్ద బోంజబాబు, రామ్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల పెంపు ప్రతిపాదన విరమించుకోవాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కు నగరంలో నివాసముంటున్న కార్మికులపై స్టీల్‌ప్లాంట్ ఉన్నత యాజమాన్యం దాడిలో భాగంగా కరెంటు చార్జీల పెంపు ప్రతిపాదనలు ముందుకు తీసుకు వచ్చిందని దీనిని తక్షణం ఉపసంహరించుకోవాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో కరెంటు చార్జీలు పెంపు ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని ధర్నా నిర్వహించారు. స్టీల్ యాజమాన్యం గత రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న కరెంటు చార్జీలను అమాంతం పెంచేందుకు రంగం సిద్ధం చేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. కార్మికులకు కనీస నివాసయోగ్యం లేనటువంటి క్వార్టర్స్ లో కార్మికులు నివాసం ఉంటున్న వారిపై భారాలు మోపడం సరికాదని ఆయన వివరించారు. స్టీల్ సిఐటియు మిత్రపక్షాల నాయకులు డివి రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్ సన్యాసిరావు, స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల నాయకులు పి.శ్రీనివాస రాజు, యు.వెంకటేశ్వర్లు, బి.అప్పారావు, కె.గంగాధర్, పుల్లారావు, మరిదయ్య, కె బాలశౌరి, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ వేగవంతం చేయండి

విశాలాంధ్ర - జి.మాడుగుల: పాడేరు నియోజకవర్గంలో ఓటర్ వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తి చేయాలని పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం జి.మాడుగుల మండల అధ్యక్షులు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సోమేలి చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి, బీసీ సెల్ ఉపాధ్యక్షులు పాలుపర్తి గోవిందరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క కార్యకర్త టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ వెరిఫికేషన్ సేవా మిత్ర నియామకాలు, హౌస్ మ్యాపింగ్ రెండు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమల చిట్టిబాబు, కొండలరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవకరకట్ట భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొండకర్ల ఆవ సమీపంలో గల ఆవకరకట్ట భూమిలో అక్రమార్కులు ప్రవేశించి కబ్జాలు చేసి, డెవలపర్స్ పేరుతో నిర్మాణాలు చేపట్టినా స్థానిక అధికారులకు కనిపించకపోవడం విచిత్రంగా ఉందని పూడిమడక గ్రామానికి చెందిన పోలవరపు పారునాయుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ మునక, ఆవకరకట్టు సర్వే నంబర్లు 226/2,227/1, 227/2, 227/3, 227/4, 227/5లో గల సుమారు 2 ఎకరాల 30 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కస్పా డెవలప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుకుమార్ వర్మ కబ్జా చేసి సింగూరు మోడల్ గెస్ట్ హౌస్ నిర్మించి దానికి చుట్టూ ప్రహరీ నిర్మించారని గత నెల 12న స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో మళ్లీ కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే నెంబర్లలో గల భూమిని రీ సర్వే చేసి వాస్తవాలు వెల్లడించాలని, నిర్మాణాలకు, పంచాయతీ, వీ. ఎం. ఆర్ .డి ఏ అనుమతులు ఇచ్చుంటే వాటిని కూడా బహిర్గతం చేయాలని పారునాయుడు డిమాండ్ చేశారు.

డావిన్సీలో 21వ శతాబ్దపు నైపుణ్య సంబరాలు

విశాలాంధ్ర - మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో స్థాపించబడిన డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్ట్, ఉపన్యాసకులు గంపా నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు 21వ శతాబ్దపు విద్యా ప్రమాణాలపై సెమినార్ ఇచ్చారు. 21వ శతాబ్దపు ఆధునిక విద్యా విధానంపై టి.ఎల్.ఎం.లు ఉపయోగిస్తూ తరగతి గదిలో జరిగే విధానాన్ని తల్లిదండ్రులకు వివరించారు. గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థుల మనుగడ, నైతిక విలువలతో కలిగిన భావి భారత నిర్మాతలని తెలియజేశారు. సాయంత్రం 6 గంటల నుంచి 8:30 వరకు పిల్లలపై తల్లిదండ్రులు వ్యవహరించవలసిన విధానంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వారితో ఎలా ఉండాలి అనేదానిపై సెమినార్ ఇచ్చారు. కార్యక్రమంలో మెక్ మిలన్ నేషనల్ హెడ్ క్వార్టర్ నుంచి ఆల్టోర డైరెక్టర్ మిస్టర్ సూరత్ సుమన్, మిస్టర్ సాదిక్యు, ప్రిన్సిపల్ మీనా మిశ్రా, డీన్ సూరిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్లూరి దాడి చేసిన పోలీస్ స్టేషన్‌ని సంరక్షించండి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పాత పోలీస్ స్టేషన్లో సోమవారం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు సందర్శించి, దీనిని సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా అల్లూరి 125వ జయంతి ముగింపుత్సవాన్ని పురస్కరించుకొని బ్రిటీష్ కాలం నాటి పోలీస్ స్టేషన్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు సబ్ ఇన్స్పెక్టర్ వి.జాన్ కుమార్, జాతీయ అల్లూరి యువజన సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, కార్యదర్శి లక్కాకుల బాబ్జి, కార్యవర్గ సభ్యులు సోమిరెడ్డి రాజు, హెడ్ కానిస్టేబుల్ ఫాండురంగ, రాజబాబు, కానిస్టేబుల్స్ సూర్య ప్రకాష్, పెద్దబ్బాయి, మునిషా, పి మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నిధులివ్వమంటే అరెస్టులా...!

విశాలాంధ్ర - ఆనందపురం: కేంద్ర ప్రభుత్వం 2019-2022వ ఆర్థిక సంవత్సరాలకు 14,15వ ఆర్థిక సంఘం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 12918 గ్రామ పంచాయతీలకు పంపిన రూ.8660 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల సంతకం లేకుండా దొంగలించి దారి మళ్లించి తన సొంత పథకాలకు సొంత అవసరాలకు వాడుకుందని వీటిని ఇవ్వమంటే అరెస్ట్‌లు చేస్తారా అని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు అన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం పంపిన రూ.2010 కోట్లు 2023-24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రావలసిన రూ.2020 కోట్లు మొత్తం కలిపి రూ! 12690 కోట్ల రూపాయలు సర్పంచుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

బండారు ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా



విశాలాంధ్ర - పెందుర్తి: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యన్నారాయణ మూర్తి తన కుటుంబం మీద చేసిన ఆరోపణలపై జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, వైసీపీ నాయకుడు ముమ్మన దేముడు తీవ్రంగా స్పందించారు. సుజాత నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముమ్మన మీడియాతో మాట్లాడుతూ చినముషిడివాడ సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 123/4లో 24 సెంట్లు భూమిని తన సోదరుడు శ్రీరామ్మూర్తికి ఉపాధి నిమిత్తం ప్రభుత్వం 1992లో మార్కెట్ వేల్యూకు విక్రయించిందని తెలిపారు. ఆ తర్వాత జగన్నాథం అనే వ్యక్తి కోర్టులో కేసు వేయగా సుమారు 30 ఏళ్లు పోరాడి కేసు గెలుచుకున్నామని తెలియచేసారు. కోర్టు ఆదేశాలతోనే జిల్లా కలెక్టర్ 22ఏ నుండి ఆ భూమిని తొలగించారని చెప్పారు. ఇందులో తమ పార్టీ నాయకులు వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అదీప్ రాజ్ ల ప్రమేయం లేదని స్పష్టం చేసారు. తనపై చేసిన ఆరోపణలు రుజువు చేస్తే కార్పోరేటర్ పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఆయన వెంట 97వ వార్డు వైసీపీ అధ్యక్షుడు మెంటి మహేశ్ తదితరులు ఉన్నారు.

బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టపరచాలి

టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

విశాలాంధ్ర - పాయకరావుపేట: గ్రామాల్లో బూత్ స్థాయి నుండి తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేసి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. మండలంలోని పెంటకోట గ్రామంలో గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం, గుంటపల్లి, నామవరం, సీతా రాంపురం, పిఎల్‌పురం గ్రామాల బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ ఆదేశాల ప్రకారం ఇన్‌ఛార్జిలు పనిచేయాలని కోరారు. ప్రతీ ఒక్కరి వద్ద ఓటర్ల జాబితా ఉండాలని, టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కంకిపాటి వెంకటేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జులు చిక్కాల శ్రీనివాసరావు, కీర్తి సీతారాం, గణపర్తి రాజబాబు, కట్టా శ్రీను, సిదిరెడ్డి నాగేశ్వరరావు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలంలోని నర్సయ్య పేట వద్ద నిర్మాణంలో ఉన్న క్రొత్త విద్యుత్ సబ్ స్టేషన్‌కు తక్షణమే నిధులను మంజూరు చేసి, విద్యుత్ కష్టాలు నుండి ప్రజలను కాపాడాలని కోరుతూ ఏ.పి.రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందనలో వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ చోడవరంలో లోవోల్టేజీ, కరెంటు కోతల సమస్యల పరిష్కారానికై, నర్సయ్యపేట వద్ద పెండింగ్‌లో ఉన్న రెండవ విద్యుత్ సబ్ స్టేషన్‌కు తక్షణమే నిధులను మంజూరు చేసి, నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేసిన వినతిపత్రానికి మద్దతుగా సుమారు 500మంది వర్తక, వ్యాపార వర్గాల, విద్యుత్ వినియోగదారుల నుండి సంతకాల సేకరణ చేశామన్నారు. ఏడేళ్ల క్రితం నర్సయ్యపేట వద్ద ప్రతిపాదించిన రెండవ విద్యుత్ సబ్ స్టేషన్ పెండింగ్ లో ఉండిపోయిందన్నారు. దీనికిగాను నర్సయ్యపేట లోని సర్వే నెంబర్ 298 లో 50 సెంట్లు ప్రభుత్వ భూమిని కేటాయించినా, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతా అధికారులు దృష్టికి పెట్టకపోవడంతో పెండింగ్‌లో ఉందని, తక్షణమే నిధులను మంజూరు చేసి, నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైలా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మరిసా నాయుడు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా నాయకులు ఎన్.భాస్కర్ పాల్గొన్నారు.

స్పందనకు 41 దరఖాస్తులు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన 41 సమస్యలపై సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారులు దరఖాస్తులు ఇచ్చారని ఐటీడీఏ పీఓ పేర్కొన్నారు. వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరి కొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సంబంధిత అధికారులకు పరిష్కారం కొరకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. పీఓ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు ఇరువురు కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. మారేడుమిల్లి మండలం పోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా బర్త్ వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని, పుల్లంగి గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పీ ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్ నాగేశ్వరరావు, ఏడీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అనూష, పీహెచ్‌ఓ కె.చిట్టిబాబు, డాక్టర్ ఓబి ఇందిరా, వెలుగు ఏపిడి ఏ.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ అర్టికల్చర్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చౌదరి, ఏఎంఓ సి.శ్రీహరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్ర బాబు, దుర్గాప్రసాద్, ఎ.వెంకటేశ్వరరావు, చైతన్య, డాక్టర్ గోపిక, జీసిసి డివిజనల్ పార్వతీశ్వరరావు, సిడిపిఓ సంధ్యారాణి, జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి, మలేరియా అధికారి నక్క వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ కార్యాలయ సూపరెంట్ బి.కిషోర్, డిప్యూటీ తాసిల్దార్లు రవీంద్రబాబు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్లే అనురాధ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని బృహత్తరమైన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేయ తలపెట్టారన్నారు. ప్రజల ఇంటి ముందుకే వాలంటరీ ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు వస్తాయన్నారు. గతంలో ఈ సర్టిఫికెట్లు పొందాలంటే ప్రజలు గ్రామంలో ఉన్న నాయకులు, కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గ్రామానికి ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు నాలుగు కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేయుటకు నిధులు ఇచ్చారన్నారు. మరల సిమెంట్ రోడ్లు వేయుటకు 90 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయగా సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏ నియోజకవర్గంలో లేని అభివృద్ధి మాడుగుల నియోజవర్గంలో ముత్యాల నాయుడు చేసి చూపించారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో కాంద్రేగుల శశి దేవి, తహశీల్దార్ రమేష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ రమేష్ బాబు, ఈఓపీఆర్డీ ప్రసాదు, గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, వైస్ ఎంపీపీ రంగలి సూర్యనారాయణ, స్థానిక ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వైసీపీ మండల నాయకులు దాట్ల శివాజీ రాజు, పంచాయితీ కార్యదర్శి నక్క రామనాయుడు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గొలుగొండ: మండలంలో పాత కృష్ణ దేవి పేట సచివాలయంలో సర్పంచ్ పందిరి సత్యం నాయుడు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఎటువంటి సర్టిఫికెట్లు అవసరము తెలియజేసినట్లయితే వెంటనే వారికి ఆ సర్టిఫికెట్ మంజూరు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ డిప్యూటీ తాసిల్దార్ ఆనంద్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మాకవరపాలెం సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంను విస్తృతంగా తీసుకెళ్లి గ్రామస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీపీ సత్యనారాయణ, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు వాసు, ఎంపీటీసీ సర్వం, భద్రాచలం, హరిబాబు, కో బ్యాంకు అధ్యక్షులు పాశపు నాగేశ్వరావు, పైల నాగయమ్మ, చిటికల రమణ పాల్గొన్నారు.

పాయకరావుపేట: గ్రామాల్లో గతంలో నమోదు కాని జనన, మరణాల ధృవపత్రాలు జగనన్న సురక్ష పథకం ద్వారా పొందవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. మండలంలోని నామవరం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో కుల దృవపత్రాలు -51, ఆదాయ దృవపత్రాలు - 52 పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవాల చుట్టూ తిరక్కుండా దృవప్రతాలు నేరుగా గ్రామాల్లో పొందేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకం పెట్టారని తెలిపారు. 10ఏళ్ల క్రితం పుట్టినా, మరణించిన వారికి సంబందించిన జనన, మరణ ధృవపత్రాలు పంచాయతీల్లో నమోదు కాకపోయినా పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రెవెన్యూకు సంబందించి మ్యుటేషన్‌ను జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలని ఎంపీడీఓ సాంబశివరావు కోరారు. ఈ కార్యక్రమంలో డిటీ కె. నూకరాజు, వైసీపీ నాయకులు రామాల శ్రీనివాసరావు, పక్కుర్తి లోవ కుమార్, పంచాయతీ కార్యదర్శులు బిఎబిఎల్ మూర్తి, డి.విజయరాజు, అర్జునాచారి, విఆర్ఓ ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంతోనే సమస్యల పరిష్కానికి సాధ్య పడుతుందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సంతారి, భీమవరం పంచాయితీలలో సోమవారం ఆయ న పర్యటించారు. ఈ నేపధ్యంలో జ రిగిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమానికి హాజరయ్యారు. గత నెల 24 వతేది నుంచి 30 వరకు గ్రామల్లో వాలింటీర్లు చేసిన సర్వేలో వచ్చిన 1,658 ధృవపత్రాలు,తదితర సమ స్యలపై వచ్చిన దరఖాస్తుల్లో సోమవారం జరిగిన జగన్న సురక్ష పథకం శిబిరంలో 922 ధృవత్రాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా గిరిజనులకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగం, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, పాడేరు డిపిఓ కొండలరావు, పంచాయతీరాజ్ ఏఈ ఎస్.సంజీవరావు, ఆర్ డబ్ల్యుఎస్ జేఈ రమేష్, మండల్ ఆర్ఐ రంగారావు, ఐసిడిఎస్ సిడిపిఓ బాల చంద్రమణి దేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మూర్తి, జేసీయస్ మండల ఇన్‌చార్జి కే.రామకృష్ణా, ఎంపీటీసీ సుశీల, స్థానిక సర్పంచ్ అప్పలనా యుడు, సింహాచలం, కాకరి బొంజు బాబు, ఎంపిటీసీలు నైని రజని, నాయకులు పాల్గొన్నారు.

యానాదులను ఎస్టీలుగా గుర్తించాలి

మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ గూటూరు

విశాలాంధ్ర - పాయకరావుపేట: యానాదులను ఎస్టీలుగా గుర్తించి కుల ధృవపత్రాలు మంజూరు చేయాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు తహశీల్దార్‌ను కోరారు. జగనన్న సురక్ష పథకం కార్యక్రమం పట్టణంలోని సచివాలయం -2లో జరిగింది. ఈ సందర్భంగా 110 కుల, 108 ఆదాయ దృవత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యానాదులకు ఎస్టీ దృవపత్రాలు ఇవ్వాలంటూ చాలా ఏళ్లుగా అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో యానాదులను ఎస్టీలుగా గుర్తించి దృవపత్రాలు ఇస్తున్నారని తెలిపారు. అలాగే కాపులకు బిసి దృవపత్రాలు ఇవ్వాలని కోరారు. చాలా మండలాల్లో జీవో నెంబరు 1793 అనుసరించి కాపులకు బిసి దృవపత్రాలు ఇస్తున్నారని తెలిపారు. అలాగే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఇంకా పాయకరావుపేట పట్టణంలో సుమారు 300 మంది అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు కావాల్సి ఉందని తెలిపారు. అధికారులు సర్వే చేసి మిగిలిన అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. తహశీల్దార్ జైప్రకాష్ మాట్లాడుతూ దృవపత్రాలు, ఇళ్ల స్థలాలు విషయమై ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్ఐ త్రినాధ్, వైసీపీ నాయకులు ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, కేశనకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల పాలై యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - పాయకరావుపేట: లాటరీలు ఆడి అప్పులపాలై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని బృందావనంలో జరిగింది. కాలనీకి చెందిన కోనేటి మణికంత సాయి కుమార్ (25) తాపీ పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. లాటరీలు, బ్రాకెట్‌లకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. సుమారు రూ.40వేలు పైగా అప్పులు చేశారు. దీంతో పాటు ఇంట్లో వివాహాల కోసం రూ.3లక్షలు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చమని అప్పులు ఇచ్చిన వాళ్లు బలవంతం చేయడంతో అప్పులు తీర్చలేక గడ్డి మందు తాగి గత నెల 30 తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. తునిలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించి అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడు చెల్లెలు పి.సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో 90% రాయితీ తో విత్తనాలను ముసురిమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం, తామరపల్లి సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన రైతులకు 90% రాయితీ కూడిన విత్తనాలు మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని, అలాగే మన ఐటిడిఏ ద్వారా 50% రాయితీ యంత్ర పరికరాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రైతులు వార్డ్ మెంబర్ గంగా, చిట్టి దొర, రైతు భరోసా కమిటీ చైర్మన్ కుంజం అబ్బులు, మాజీ సర్పంచ్ సారపు బాపిరాజు, వైసీపీ నాయకులు రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్, వాలంటర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - జీకే వీధి: సీజనల్ వ్యాధుల పట్ల మన్య ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డీకే హిమబిందు అన్నారు. చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే ఇద్దరు వైద్యులు సెలవుపై వెళ్లడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమీల్ భాష ఆదేశాల మేరకు అన్నవరం వారపు సంతకు వచ్చే రోగులను పరీక్షించేందుకు గాను దారకొండ వైద్యాధికారిణి హిమబిందును ఒక్కరోజు లోతుగెడ్డ పీహెచ్సీలో రోగులకు సేవలందించేందుకుగాను ఆదేశించారు. ఈ మేరకు వైద్యాధికారిణి హిమబిందు ఈ పీహెచ్‌సీలో సోమవారం ఒక్కరోజే 186 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ గుల్లెల సింహాద్రి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అల్లూరి జయంతి

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఉన్న స్వతంత్ర సమరయోధుడు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈనెల 4వ తేదీన తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నివాళులర్పించేందుకు వస్తున్నారని మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని అడ్డతీగల మండలం పింజరకొండ జల విద్యుత్ ప్రాజెక్టులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఆపరేటర్లు, హెల్పర్లు ఉద్యోగాలకు గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి ఛాంబర్‌లో ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు https:// itda rampachodavaram. Ap. Govt.In వెబ్ సైట్‌లో గాని, అదేవిధంగా aptripco @gmail. Com ద్వారా గాని వ్యక్తిగతంగా దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు. వివరాలకు 9700230224ను సంప్రదించాలని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గిరిప్రదక్షిణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: శ్రీ సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామి వారి గిరి ప్రదక్షణ ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా అంగరంగ వైభవంగా జరిగింది. గిరిప్రదక్షిణలో విశాఖ వాసులతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు సుమారు అయిదు లక్షల పైబడి గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు. తొలిపావంచ నుండి అడివివరం, హనుమంతవాక, వెంకోజి పాలెం, సీతమ్మధార, మురళి నగర్, ఎన్ఏడి జంక్షన్, గోపాలపట్నం మీదుగా సింహాచలం దేవస్థానం వరకు అప్పన్న స్వామి గిరి ప్రదక్షణ ఆద్యంతం కమనీయంగా సాగింది. జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సింహాచలం దేవస్థానం, జీవీఎంసీ ఎక్కడికక్కడ త్రాగునీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేకంగా 30 బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

జిల్లాలో విజయవంతంగా జగనన్న సురక్ష

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం కూడా విజయవంతమైందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో 12 మండలాల పరిధిలోని 19 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించమన్నారు. వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 16,785 వినతులు రాగా, 14,164 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 6,592 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని, 47 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా మిగిలిన 7,525 సర్టిఫికెట్లు పంపిణీ చేయటం జరుగుతుందని కలక్టర్ వివరించారు. అదే విధంగా జగనన్న సురక్ష శిభిరాలలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడికక్కడే దరఖాస్తులు తీసుకొని ఆన్లైన్ చేసి దృవపత్రాలు జారీ చేసి పంపిణీకి ఆదేశించటం జరిగిందన్నారు.

నేటి జగనన్న సురక్ష కార్యక్రమాల వివరాలు

మంగళవారం నాడు జిల్లాలోని 12 మండలాల పరిధిలో గల 20 సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆయా గ్రామస్తులకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు. అడ్డతీగల మండలంలో రాయపల్లి, అనంతగిరి మండలంలో అనంతగిరి, గుమ్మ, అరకు వేలీ మండలంలో మాడగడ, పెదలబుడు, చింతూరు మండలంలో చింతూరు, ముకునూరు, జికె వీధి మండలంలో దుప్పులవస, సీలేరు, హుకుంపేట మండలంలో గంనేరుపుట్టు, గట్టుం, కూనవరం మండలంలో కూతూరు, ముంచంగుపుట్టు మండలంలో బరడ, కిలగాడ, ఎటపాక మండలంలో కన్నాయిగూడెం, నెల్లిపాక, పెదబయలు మండలంలో కుంతర్ల, పెదకోడపల్లి, వి.ఆర్. పురం మండలంలో వడ్డిగూడెం, వై. రామవరం మండలంలో పాత కోట సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది.

నేటి స్పందన కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర - చింతూరు: ఈ నెల 5వ తేదీ బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఐటీడీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంఈఓ-1గా అప్పారావు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల విద్యాశాఖ అధికారి 1గా పి.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారంగా ప్రతి మండలానికి ఇద్దరు విద్యాశాఖ అధికారులను నియమించాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతం ఉన్న మండల విద్యాశాఖ అధికారి ఏఎస్ఎన్ఏ మూర్తి ఎంఈఓ.2గా మండలంలోని నారాయణపట్నం జిల్లా పరి షత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు ఎంఈఓ 1గా నియమించారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాల అయినా ఏ పి టి ఎఫ్, పి ఆర్ టి యు నాయకులు వచ్చి ఎంఈఓను పరిచయం చేసుకున్నారు. ఇరు వురు ఎంఈఓ లు విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేస్తారని నమ్మకం అందరికీ ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

ఏపీజీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణపై దాడి సరికాదు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు తావుల కృష్ణా రావుపై దాడికి పాల్పడటం సరి కాదని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. గత దశాబ్దాల కాలం నుండి 1/70చట్టం, గిరిజనుల హక్కులు, గిరిజనేతరుల అక్రమ నిర్మాణాల గురించి నిరంతరం పోరాటలు చేస్తున్న హుకుంపేట గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణారావుపై దాడికి పాల్పడడం చాలా దుర్మార్గం అన్నారు. అలాగే దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని గేదెలబంద పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు నెమలిపూరి జగదీశ్, సహోపాధ్యాయులు అప్పలస్వామిని స్థానిక విద్యా కమిటీ చైర్మన్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ప్రధానోపాధ్యాయురాలు యు.రజిత మాట్లాడుతూ ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి సేవలు అందించారని అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - పద్మనాభం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలో మంగళవారం లైన్ మెయింటెనెన్స్ కొరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోడగలవానిపాలెం, సీతంపాలెం, జగ్గురాజుపాలెం, పందలపాక, యూతపేట, ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆనందపురం ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

విద్యార్థులు మెనూను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: వైకాపా ప్రభుత్వం ఆశ్రమ వసతి గృహ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మెనూ ను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల ద్వారా అందిస్తున్న మెరుగైన విద్యను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి

అన్నారు, మండలంలోని వంగసార బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హిందీ, పి. ఎస్. ఉపాధ్యాయుల కొరత ఉందని, అదేవిధంగా నాన్ టీచింగ్ స్టాఫ్ కొరత ఉందని ప్రధానోపాధ్యాయుడు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మెనూ విషయాన్ని ఆశ్రమ వసతి గృహ నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆమె దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందిస్తూ సమస్యలను శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ద్వారా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆశ్రమ వసతి గృహ విద్యార్థినిలకు ఆమె స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి ఉన్నారు.

అర్హులు పథకాలకు దూరం కాకుండా ఉండేందుకే సురక్ష

విశాలాంధ్ర - జి.మాడుగుల: అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టారని పాడేరు శాశన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జి.మాడుగుల మండలం వంతల సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అర్హులకు లబ్ది చేకూరుస్తుందన్నారు. జగనన్న సురక్ష పథకంలో గుర్తించబడిన 11 రకాల సేవలను లబ్ధిదారులకు ఉచితంగా అందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు డా. వెంకటలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి డిపిఆర్ఓ వి.గోవిందరాజు, తహశీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీఓ చంద్ర శేఖర్, ఏటీడబ్ల్యూఓ పాల్, సీడీపీఓ సువర్ణమ్మ, సర్పంచులు చిన్న కుమారి, హనుమంత రావు, ఎంపీటీసీ సన్యాస్ దొర, మండల అధ్యక్షులు మచ్చ కొండం నాయుడు, జేసిఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష

విశాలాంధ్ర - అనంతగిరి: ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసం ప్రభుత్వ పథకాలకు అర్హులైన రానివారికి లబ్ది చేకూర్చాలని లక్ష్యంతో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నేటి నుంచి మండలంలో జరుగునున్నదని మండల అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. దీనికి మండలంలో రెండు టీములుగా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ టీములు విడివిడిగా కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన అన్నారు. మొదటి టీం తాసిల్దార్ రెండో టీం ఎంపీడీవో టీం ఈ కార్యక్రమం నేటి నుంచి 27వ తారీకు వరకు మండలంలో జరుగుతుందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

అర్హులై ఉండి పథకాలు అందని వారి కోసమే జగనన్న సురక్ష

విశాలాంధ్ర-యలమంచిలి: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నారని నియోజకవర్గ శాసన సభ్యులు యూ.వి.రమణమూర్తి రాజు(కన్నబాబు) అన్నారు. ఈ సందర్భంగా సోమవారంనాడు మండలంలో మామిడివాడ గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ 11 రకాల

ధృవపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందిస్తామన్నారు. సీఎం జగన్ 99.5 శాతం సంక్షేమ ఫలాలు అందించారని, నూటికి నూరు శాతం లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే ఆయన ఉద్దేశమన్నారు. ప్రజలను జల్లెడ పట్టి వారి సమస్యలను గుర్తించి ప్రభుత్వ సిబ్బంది పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమం పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించారన్నారు. అనంతరం వ్యవసాయాధికారి సుమంత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు,మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మల చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,జెడ్పిటిసి దూళి నాగరాజు, మండల ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కన్వీనర్ వేపాక రాము తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఎన్నారైల వితరణ

విశాలాంధ్ర - చింతూరు: చింతూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రవాసాంధ్రులు ఎడ్లపల్లి రామారావు, కైసా కాశీ, సూది రెడ్డి విక్రం రెడ్డి, గాందే సునీల్ కుమార్‌లు 100 బెడ్ షీట్లు, 100 పిల్లో కవర్స్, సోమవారం ఆసుపత్రి డాక్టర్లు కోటిరెడ్డి, కృష్ణారెడ్డికు అందజేశారు. ఆస్పత్రి సిబ్బంది డాక్టర్లు ప్రవాసాంధ్రు ల కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందించాలన్నదే "జగనన్న సురక్ష" పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యలు అన్నారు. సోమవారం ఎంపీడీవో ఆశాజ్యోతి అధ్యక్షతన అన్నవరం పంచాయతీ కేంద్రంలోనూ, అదే విధంగా తహసీల్దార్ లచ్చా పాత్రుడు ఆధ్వర్యంలో కొమ్మంగి పంచాయతీలోనూ జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో అన్నవరం లో ఎంపీపీ అనూష దేవి, కొమ్మంగి పంచాయతీలో జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్యలతో పాటు డి ఎల్‌పిఓ పీఎస్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అన్నవరం పంచాయతీలో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం 650 మంది దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవో తో కలసి 190 మందికి నేడు ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగిందని, మిగిలిన వారికి రేపటి నుంచి గృహసారథులు వాలంటీర్లు తమ తమ ఇళ్లకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఎంపీపీ, అనూష దేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి లు తెలిపారు. అదేవిధంగా కొమ్మంగి పంచాయతీలో 882 మంది వివిధ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం దరఖాస్తు చేసుకోగా 260 మందికి పైగా ధ్రువీకరణ పత్రాలను ఆ పంచాయతీ సర్పంచ్ పాంగిలక్ష్మి ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతులతో కలసి అందజేయడం జరిగిందని జెడ్పిటిసి బాలయ్య, డి ఎల్ పి ఓ కుమార్, తహసిల్దార్ లచ్చా పాత్రుడులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, డిప్యూటీ తహసిల్దార్ రాజ్ కుమార్, ఏటిడబ్ల్యూఓ జయ నాగలక్ష్మి, వైకాపా జెసిఎస్ మండల కన్వీనర్ పాంగి గుణ బాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొండబాబు, ఐసిడిఎస్ సిడిపిఓ రమణి, ఎసిడిపిఓ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో ఉన్న శ్రీ సద్గురు ప్రసన్న సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి శ్రీ దత్తమూర్తుల చిత్రపటాలతో సాయిబాబా భక్తుల ఆధ్వర్యంలో మోతుగూడెం గ్రామంలో విశేష నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

చోడవరం: వ్యాస (గురు) పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం చోడవరం, వెంకన్నపాలెం,

విజయ రామరాజు పేట తదితర గ్రామాల్లోని సాయినాథుని ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో లక్ష తులసి పూజ, అభిషేకములు భక్తులచే సామూహికంగా నిర్వహించారు. వేకువ జాము నుండి పురుష సూక్త విధానంలో సాయినాథునికి పంచామృతములతో ప్రత్యేక అభిషేకములు, కాకడ హారతి, మధ్యాహ్న, ధూప, షేజ్ హారతి లను వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అఖండ అన్న సమారాధన (నారాయణ సేవ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోవాడ సుగర్స్ ఎం.డి. వి.సన్యాడినాయుడు (వెంకన్నపాలెం), కందర్ప అశోక్, రామేశం (చోడవరం), దొడ్డి వెంకట ముత్యాలు నాయుడు దంపతులు (విజయరామరాజు పేట), ప్రధాన అర్చకులు గుంటూరు శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల కణితి కాలనీ కళింగ వీధి గాంధీ బొమ్మ దగ్గర

రామాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా శిరిడి సాయి బాబాకి పాలాభిషేకాలు, జలాభిషేకాలు, పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు వైఎస్ఆర్సివి సీనియర్ నాయకులు వడ్లపూడి సబ్ స్టేషన్ ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వైసీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, వార్డు కార్యదర్శి ముద్దపు దామోదర్, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దుగ్గపు దానప్పలు, సోషల్ మీడియా కన్వీనర్ బోండా గోవి ందరాజులు, అభయ కోదండరామాలయ గుడి కమిటీ సభ్యులు ప్రగడ శంకర్రావు, ప్రగడ శ్రీనివాస్, కేవీ నారా యణ, బొడ్డ సన్యాసిరావు, పూడి శ్రీను, ప్రగడ, రాము, పి సన్యాసిరావు, కళింగ యూత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో గల షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా

నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుడిమెట్ల వెంకటేశ్వరరావు ప్రసాద్ మాస్టారు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసి పలువురికి ప్రసాదాలను అందించారు. సోమవారం ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీను గణేశ్, బుచ్చిరాజు, శివ, సూర్య, పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం షిరిడి సాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా గురు పౌర్ణమి ఉత్సవాలను అత్యంత వైభవపేతంగా నిర్వహిం చారు. ఉదయం 5:15 గంటలకు షిరిడి సాయి విగ్రహానికి కాగడా హారతి తో ఉత్సవాలు ప్రారంభించారు. 6 గంటలకు నిత్య పూజ హోమం కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. 9 గంటలకు అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో స్థానిక సీనియర్ రాజకీయ నాయకులు చింతకాయల సన్యాసి పాత్రుడు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో షిరిడి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, షిరిడి సాయి సేవా సమాజ్ కార్యదర్శి వి.రామచంద్ర రాజు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పోతుల సత్తిబాబు, జాయింట్ సెక్రటరీ నంబూరి సత్యనారాయణ, సభ్యులు పివి రమణారావు, మంతిన రమణారావు, లాలం చిన అప్పారావు, మోటూరి లోవరాజు, బాబ్జి, ఆలయ ప్రధాన అర్చకులు ఎం రాజేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: చంద్రంపాలెం జాతర గట్టుపై కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ శ్రీ షిర్డీ సాయినాథ సహిత శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో గురుపౌర్ణమి సంద ర్భంగా సాయిబాబా వారికి క్షీరాభిషేకం, పంచా మృత సుగంధ ద్రవ్యాలు జలాభిషేక ములతో ఆలయ అర్చకులు పట్నాల ప్రసాద్ శర్మ, శంక ర్రావు స్వామిలు అభిషేకం జరిపించడం జరిగింది. అనం తరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సాయిబాబా వారికి అన్నాభిషేకం జరిపించడం జరిగింది. గురుపౌర్ణమి సంద ర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిల్పారామాలు డి.శ్యామ సుందర్రెడ్డి, స్థానిక శిల్పారామం విశ్వనాథరెడ్డిలు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారిని, సాయినాధుని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో వి.వి.రమణమూర్తి కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, కమిటీ ఉపాధ్యక్షులు పివిజి అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీని వాస రావు, ఉప కోశాధికారి దుక్క వరం, ఆర్గనైజింగ్ సెక్ర టరీ పీస రమణ, పోతిన జోగి, సభ్యులు పిళ్లా వెంకట రమ ణ, పోతిన పైడిరాజు, నాగోతి అప్పలరాజు, కేశనకుర్తి అప్పా రావు, పొట్నూరి హరికృష్ణ, మరుపిల్లి ఆనంద్ పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలంలోని గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం నుంచి మండలంలోని ఎన్.రాయవరం, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, అడ్డరోడ్డు తదితర గ్రామాల్లో సాయిబాబా ఆలయాలకు భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం ఎస్.రాయవరం శిరిడి సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడంతో భక్తులు వచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీ,గ్రామీణంలో గల స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ఉలక్ పేట,ఎర్రవరం జాతీయ రహదారి పక్కన ,పెదపల్లి, రేగుపాలెంలలో ఉన్న సాయిబాబా ఆలయాలలో సోమవారం గురు పూర్ణిమ సందర్భంగా పాలు, పండ్ల రసాలతో బాబా విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. గురు పూర్ణిమ రోజు ప్రతీ ఒక్కరూ తమ గురువులని సేవించడం సాంప్రదాయమని దాని ద్వారా మంచి క్రమశిక్షణ, మంచి ఫలితాలును సంపాదించుకోవచ్చునని ఆలయ నిర్వహకులు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర కొలువై ఉన్న సాయిబాబా వారి ఆలయంలో భారీ అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పోటేత్తారు. ఈ వేడుకలలో ఆలయాల పురోహితులు కూచిమంచి సన్యాసిరాజు శర్మ ,శిశ్లా త్రిమూర్తులు వెంకటేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి వైద్యుల నియామకానికి చర్యలు

విశాలాంధ్ర - కూనవరం: కూనవరం సీహెచ్ సీలో పూర్తిస్థాయిలో వైద్యుల నియామానికి చర్యలు చేపడుతున్నట్లు పాడేరు డీసీహెచ్ ఎస్ డా. కృష్ణా రావు తెలిపారు. సోమవారం ఆయన కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనవరంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చెపడుతున్నట్లు తెలిపారు. అలాగే డెలివరీలు పెంచాలన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టు లు చేసే విధంగా చూస్తామన్నారు. అనంతరం ఆయన వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో ఇక్కడ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ప్రతీ రోజు మంచి ఆహారం అందించాలని తెలిపారు. అనంతరం ఆయన ఫార్మసీ , లాబ్ , ఎక్స్ రే , ప్రసూతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్యమంలో సూపరింటెండెంట్ డా. ఎంవీకోటిరెడ్డి , వైద్యులు డా. సరోజ్ ముఖర్జీ, డా. షఫీ , డా ,రమ్య , డా. వంశీ , డా. సౌజన్య , డా. వినాయక్ , హెడ్ నర్స్ బొజ్జి , లక్ష్మణ్ , మహేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో వెల్లంకి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం ఆరిలోవకి చెందిన కరణాల రమేష్ (34) భోగాపురం సవరవిల్లి, సన్రైజ్ వద్ద సివిల్ కాంట్రాక్టర్ పనులు చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ప్రతిరోజు ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం హీరో హెూండా గ్లామర్ బండిపై డ్యూటీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం వస్తుండగా వెల్లంకి సాధువు మటం సమీపంలో సర్వీస్ రోడ్లో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు భార్య శారద ఆదర్శనగర్ గ్రామ సచివాలయం పోలీస్ మహిళా పోలీస్ గా విధులు నిర్వహిస్తుంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి ఆనందపురం సిఐ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం ముసుగులో సర్వం దోచుకుంటున్న వైసీపీ

విశాలాంధ్ర - చింతపల్లి: సంక్షేమం ముసుగులో అభివృద్ధిని విస్మరించి సర్వం దోచుకుంటున్న ప్రభుత్వం వైకాపా అని, దాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని తెదేపా మహిళ నాయకురాలు నంబారి సత్యవతి అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్ భీమన్న వీధిలో ఆ పార్టీ చింతపల్లి క్లస్టర్ ఇన్చార్జి వంతల భీమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లలో చేసేవారన్నారు. నేడు వైకాపా ప్రభుత్వం నవరత్నాలు, సంక్షేమం అంటూ అభివృద్ధిని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి క్లస్టర్ ఇన్ ఛార్జ్ కొండబాబు యూనిట్ ఇన్ ఛార్జ్ రమణ, బూత్ కన్వీనర్లు మహేష్, రమణ, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష ధ్రువపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం దూసరిపాము పంచాయితీ,అదే గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు రకాల ధ్రువపత్రాలు లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పూర్తి జవాబు దారితనంతో పని చేస్తుందని, సురక్ష పథకం ద్వార ప్రభుత్యం ప్రజలకు మరింత చేరువవుతుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వడుగుల జ్యోతి, సర్పంచ్ చీడి శివ, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళి కృష్ణ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో రైతు పొలంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కీర్తి వెంకటేషు (62) పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ తీగలు కాలికి తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు . మృతుడు కుమారుడు కీర్తి నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు

ప్రతి విద్యార్థి విద్యలో రాణించాలి

విశాలాంధ్ర - చింతపల్లి :- ప్రభుత్వం అందించే ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలను సక్రమంగా వినియోగించుకుని ప్రతి విద్యార్థి విద్యలో రాణించి జీవితాన్ని మెరుగుపరుచుకోవాలని బలపం పంచాయతీ సర్పంచ్ కె రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బలపం పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆ పంచాయతీ సచివాలయ కార్యదర్శి ఎల్ చిన్నం నాయుడు, వైకాపా నాయకుడు బచ్చల బాబురావు లతో కలసి విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయురాలు గౌతమి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కియా ఇండియా నుంచి నూతన సెల్టోస్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా ఇండియా నుంచి జులై 4న కొత్త సెల్టోస్ విడుదల చేస్తున్నామని కియా ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. కొత్త అవతారంలోని సెల్టోస్, తాజా డిజైన్ శ్రేణిలోనే మెరుగైన ఫీచర్స్ ను కలిగి ఉందన్నారు. తమ శ్రేణిలోని ప్రముఖ ఫీచర్స్ మరియు డిజైన్ నాయకత్వంతో ఆటోమొబైల్ పరిశ్రమలోనే సెల్టోస్ బ్రాండ్ కొత్త విప్లవాన్ని ఆరంభించిందన్నారు. కొత్త సెల్టోస్ శ్రేణిని మరోసారి పునః కనుగొనడానికి సిద్ధంగా ఉందని, కియా 30 జూన్‌న కొత్త సెల్టోస్ టీజర్ ను కూడా విడుదల చేసిందన్నారు. అతి తక్కువ సమయంలో కేవలం 46 నెలల్లో, సెల్టోస్ 5 లక్షల మైలురాయి సేల్స్ ను దాటిన అతి వేగవంతమైన ఎస్ యూవీగా మారిందని తెలిపారు.